క్లుప్తంగా

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర పరిధిలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో జూన్ 4వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా సహకరించాలని ఎస్‌ఐ వై.అమ్మనరావు కోరారు. ఇదే విషయమై శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి తగాదాలు జరగకూడదన్నారు. ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఏ ప్రాంతంలోనూ నలుగురు, ఐదుగురు గుమిగూడి ఉండవద్దన్నారు. ఇప్పటికే సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు పర్యటిస్తూ ఎన్నికల నిబంధనలు వివరిస్తున్నారన్నారు.

మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గీతాంజలి

సీతంపేట: మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో కె.గీతాంజలి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రిజం-10 వారాంతపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతులు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం వారికి తప్పకుండా అందేలా చూడాలన్నారు. అలాగే ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ సత్యం, సీడీపీవో రంగలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ చాందిని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పొగాకుతో జీవితాలు నాశనం



పాలకొండ రూరల్: ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు

పాలకొండ రూరల్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎం.సింగుపురం, అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎస్.రవికుమార్, శివశంకర్, కమలనాథ్, వెన్నెల కలిసి పొగాకు తాగడం వల్లే కలిగే నష్టాలను వివరించారు. పొగాకు జీవితాలను నాశనం చేస్తుందని, పొగాకుకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. కొంతమంది యువత ఫ్యాషన్ కోసం ధూమపానాన్ని అలవాటుగా చేసుకుని, బంగారు భవిష్యత్‌ను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు తాగడం వల్ల ఊపిరితిత్తులు పాడవ్వడంతో పాటు క్యాన్సర్ బారినపడే అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రజలతో ధూమపానానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

వాహనాల పత్రాలు ఉండాలి

బలిజిపేట: వాహనాలకు సంబంధించిన పత్రాలు అన్నీ ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా రూరల్ సీఐ కె.రవికుమార్ అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని గంగాడ, గలావల్లి గ్రామాల్లో వాహనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. వాహనదారుల వద్ద పత్రాలు ఉన్నవీ, లేనివీ గుర్తించారు. ఎటువంటి పత్రాలు లేకుండా అనుమానాస్పదంగా ఉండే వాహనాలను సీజ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. వాహనదారుల వద్ద పత్రాలు లేనట్టు గుర్తించిన వాటిని సీజ్ చేశామన్నారు. జూన్, 4వ తేదీన ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

- జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్



రైతులకు రాయితీపై విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, తదితరులు

పాలకొండ రూరల్: ఖరీఫ్ సీజన్‌లో సాగువిస్తీర్ణం మేరకు వరి విత్తనాలను రాయితీపై ప్రభుత్వం అందజేయనుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ కోరారు. పాలకొండ వచ్చిన ఆయన స్థానిక ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం విత్తన పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఎంటీయూ-1064 (84.6 క్వింటాళ్లు), ఎంటీయూ-1121(70.5 క్వింటాళ్లు), ఆర్‌జీఎల్ 2537 రకం (61.8 క్వింటాళ్లు) విత్తనాలు సిద్ధం చేశామన్నారు. మరో రెండు రోజుల్లో ఎంటీయూ-1318, 1224, 1061, 7029 రకాల వంగడాలతో పాటు బీపీటీ 5204 రకం నిర్దేశిత రాయితీపై రైతులకు ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. రైతులు తమ పాస్ పుస్తకాలు, ఆధార్ నకలు తీసుకువెళ్లి విత్తనాలు పొందాలన్నారు. బయట మార్కెట్‌లో అధిక ధరలకు, నాసిరకం విత్తనాలు విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి, వ్యవసాయాధికారులు ఎన్ని వాహిని, జె.సౌజన్య, పి.శ్రీదేవి, మన్మథరావుతో పాటు సాంకేతిక పర్యవేక్షకులు అజేయకుమార్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

పాలకొండ రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎం.సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రవికుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఎం.సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆయన.. రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆయా వ్యాధులు బారినపడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు.

ఎక్కడా మురుగునిల్వలు, చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు, చెత్త కుప్పలు, మురుగునీటి నిల్వల వద్ద దోమలు పెరగకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు.

సీమలగూడలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యసేవల కోసం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి హాజరైన రోగులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని సీమలగూడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యారోగ్య సిబ్బంది గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యసేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, ప్రతీ ఇంటి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ఆరాతీశారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఇదే కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించి, ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

సేవలే గుర్తింపునిస్తాయి..

గుమ్మలక్ష్మీపురం:



జనార్దననాయుడును సన్మానిస్తున్న దృశ్యం

ఉద్యోగులకు విధి నిర్వహణలో వారు చేసిన మంచి సేవలే వారికి గుర్తింపునిస్తాయని ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు. ఎంఈవో-2 బి.జనార్దననాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో వీడ్కోలు సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు కలిసి జనార్దననాయుడును సన్మానించి, విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. ఉద్యోగ విరమణ అనంతర జీవితాన్ని ఆయురారోగ్యాలతో కుటుంబంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.



సీతంపేట: రోసిరెడ్డిని సన్మానిస్తున్న ఐటీడీఏ పీవో శుభం బన్సాల్, తదితరులు

సీతంపేట: ఉద్యోగులు తమ విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం బన్సాల్ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఉద్యోగ విరమణ పొందిన ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డిని శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, పీఏవో హరికృష్ణ, డిప్యూటీ ఈవో నారాయుడు, ఏఎంవో కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



సీతంపేట: క్లోరినేషన్ పనుల్లో వైద్యారోగ్య సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, దళాయివలస, ఉల్లిబద్ర, రావుపల్లి, బీపీపురం, చినగుడబ, ఉద్దవోలు, గొట్టివలస గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో నెలకొన్న చెత్తాచెదారం తొలగించడంతో పాటు కాలువల్లోని పూడికలు తొలగిస్తున్నారు. అలాగే మురుగునీటి నిల్వలు, కాలువల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు శుక్రవారం పరిశీలించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా మురుగునీటి నిల్వలు ఉండకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగానే పారిశుద్ధ్య పనులు, తాగునీటి ట్యాంకులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నామన్నారు.

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు శుక్రవారం నిర్వహించారు. మురుగు కాలువల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయడంతో పాటు తాగునీటి ట్యాంకులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. అలాగే గ్రామ ప్రధాన వీధులు, కాలువలు బ్లీచింగ్ చల్లారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

భామిని: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, బత్తిలి వైద్యాధికారి కె.దామోదరరావు అన్నారు. మండలంలోని మనుమకొండ గ్రామంలో డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, ఇంటి వద్ద గానీ ఇంటి పరిసరాల్లో గానీ మురుగునీటి నిల్వలు, చెత్తాచెదారం లేకుండా చూడాలని సూచించారు. మురుగునీరు ఉన్నచోటనే దోమలు విపరీతంగా పెరుగుతాయని, దోమల కారణంగానే మలేరియా, డెంగీ వంటి జ్వరాలు విజృంభిస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరం ఆరోగ్యంగా ఉండాలంటే మనమంతా ఐక్యంగా పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు శక్రవారం కాలువల్లో పూడికలు తీయించి, దోమలకు స్థావరాలుగా ఉన్న చెత్తకుప్పలను వాహనాలతో తరలించడం, మంట పెట్టి కాల్చడం, పూడికలు తీసిన కాలువల్లో దోమల నివారణ మందును పిచికారి చేయించినట్లు ఎంపీడీఓ ఎం ఈశ్వరరావు తెలిపారు. చినభోగిలి, అంటిపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ మందు పిచికారీని ఆయన పరిశీలించారు.

రుతుక్రమం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

సాలూరు రూరల్: ప్రపంచ రుతుక్రమం, ఆరోగ్య పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మండలంలోని కేఆర్‌పేట సెక్టార్ జనవరి వలసలో సీడీపీఓ బి.సత్యవతి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సత్యవతి మాట్లాడుతూ మహిళలు, కిశోరీ బాలికలు రుతుక్రమంలో ఆరోగ్య పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ సరైన పరిశుభ్రత పాటించాలని సూచించారు. లేనిపక్షంలో రక్తహీనతకు గురవుతారన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ బి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో ఏజెన్సీ రైతులు

సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు గిరిజన రైతులు తమకున్న కొద్దిపాటి పొలాన్ని నాగళ్లతో దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు ఏజెన్సీ రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను 90శాతం సబ్సిడీపై ఇటీవల పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారులు సలహా మేరకు గిరిజన రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం ప్రారంభించారు.

అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్‌మోహన్‌రావు



పొగాకు వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తం కావాలని జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్‌మోహన్‌రావు తెలిపారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, దోమల మందు పిచికారీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రబలే సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా ప్రతీ గ్రామంలోని మురుగుకాలువల్లో పూడికలు తొలగించి, దోమల నివారణ మందు పిచికారీ చేయడం జరుగుతోంది. వైద్యారోగ్య సిబ్బంది కూడా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి, జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన మందులు అందజేయాలన్నారు. అలాగే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను గ్రామస్తులకు వివరించారు. పొగాకు తాగడం వల్ల ఊపిరితిత్తులు పాడవ్వడంతో పాటు శ్వాస, దృష్టి సమస్యలు వస్తాయని, పక్షవాతం కూడా రావచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం వద్దు



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో సుశీలాదేవి

గుమ్మలక్ష్మీపురం: పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం ప్రదర్శించవద్దని ఐసీడీఎస్ పీవో సీహెచ్ సుశీలాదేవి అన్నారు. భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆమె.. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు మంజూరు చేసిన సెలవులు ముగిశాయని, జూన్ 1వ తేదీ నుంచి యథావిధిగా విధులకు హాజరు కావాలని తెలిపారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని, ప్రతీ చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా అందజేయాలన్నారు. బరువు తక్కువున్న పిల్లలు, హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు దృష్టిసారించాలన్నారు.

90 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

సీతంపేట: ఏజెన్సీ పరిధిలోని రైతులకు వివిధ రకాల విత్తనాలను 90 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో పలువురు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. వరి విత్తనాలతో పాటు చిరుధాన్యాల విత్తనాలను కూడా రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. విత్తనాలు కావాల్సిన వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రత్నకుమారి, ఏవో పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

కురుపాం: స్థానిక ఆదర్శ పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి, విద్యార్థుల మెరిట్ జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ యు.రామలక్ష్మి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లలో ప్రవేశాలకు ఇటీవల పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఇప్పుడు ఆ పరీక్షా ఫలితాలను పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 1వ తేదీ నుంచి జూన్ 15వ తేదీలోపు జాయిన్ కావాలన్నారు. తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ కాపీ సెట్ కూడా సమర్పించాల్సి ఉంటుందన్నారు. జూన్ 15వ తేదీలోగా పాఠశాలను సంప్రదించకపోతే అడ్మిషన్ రద్దు చేస్తామన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవు



ఓని గ్రామ ప్రజలకు సూచనలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు హెచ్చరించారు. మండలంలోని ఓని, గుడివాడ, కోటిపల్లి గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయని, ఏ పార్టీ ఓడినా, గెలిచినా ఒకటిగానే భావించాలని, గొడవలు పడొద్దన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహించరాదన్నారు. ముఖ్యంగా యువత సంయమనం పాటించాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దోమల మందు పిచికారీ



కాట్రగడలో దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

భామిని: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని కాట్రగడ గ్రామంలో బత్తిలి వైద్యారోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి కె.సంతోష్‌కుమార్‌ల పర్యవేక్షణలో దోమల మందు పిచికారీ శుక్రవారం చేశారు. కాలువలు, చెత్తకుప్పల వద్ద దోమలు పెరగకుండా ఈ దోమల మందు స్ప్రే చేశారు. అంతకుముందు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికలు తొలగించారు. దోమల కారణంగానే మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయని, వాటి బారిన ప్రజలు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కళావతి హ్యాట్రిక్ విజయం ఖాయం



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్

భామిని: వైఎస్సార్ సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హ్యాట్రిక్ విజయం ఖాయమని మండల జేసీఎస్ కో-ఆర్డినేటర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదే విషయమై శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. మంచి నాయకురాలిగా గుర్తింపు పొందిన కళావతమ్మ పాలకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా వైఎస్సార్ సీపీ తరఫున రెండుసార్లు పోటీ చేసి, గెలిచారు. ప్రస్తుతం మూడోసారి పోటీ చేశారని, ఈసారి కూడా ప్రజలు ఆమెకే మద్దతు తెలిపారన్నారు. పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు నియోజకవర్గ ప్రజల బాగోగుల కోసం ఆమె చేసిన కృషి ఫలితంగా జూన్ 4వ తేదీన విడుదలయ్యే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఆమె గెలుపు ఖరారవుతుందని జోష్యం చెప్పారు.

ఈదురుగాలుల బీభత్సం

పాలకొండ/వీరఘట్టం/గుమ్మలక్ష్మీపురం/కురుపాం:



గుమ్మలక్ష్మీపురం: ఈదురుగాలులకు మండ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై నేలకొరిగిన వృక్షం

మండలాల్లో శుక్రవారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై, ఉరుములు, మెరుపులతో ఆకాశం గర్జించింది. పిడుగుపడిన శబ్దాలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. ఇదంతా జరిగిన కాసేపటికి భారీ వర్షం కురిసింది. ఇన్నాళ్లు వేసవి ఎండల కారణంగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం ఇచ్చింది. వీరఘట్టం మండల కేంద్రంలో భారీ ఈదురుగాలులతో వర్షం కురవగా, గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. కురుపాం మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం, జరడ, తిత్తిరి, వలసబల్లేరు ప్రాంతాల్లో భారీ ఈదురుగాలులు వీయడంతో పాటు వడగండ్ల వాన పడింది. ఈదురుగాలులకు కొన్నిచోట్ల చెట్లకొమ్మలు విద్యుత్ వైర్లపై విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరికొన్నిచోట్ల పిడుగుపాట్లుకు ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతిన్నాయి. పాలకొండ పట్టణంలో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. ఈ వర్షం వ్యవసాయ పనులకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కురుపాం: మొండెంఖల్ గ్రామంలో కురిసిన వడగళ్లను చూపిస్తున్న దృశ్యం



వీరఘట్టం: మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం



పాలకొండ రూరల్: పాలకొండ పట్టణంలో కురుస్తున్న వర్షం